క్లుప్తంగా

అమరుల త్యాగాలు మరువలేనివి

భీమునిపట్నం: జలియన్‌వాలాబాగ్ దుర్ఘటనలో అమరులైన భారతీయుల త్యాగం వెలకట్టలేనిదని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. డైట్ వద్ద గురువారం జలియన్‌వాలాబాగ్ దుర్ఘటన సంస్మరణ దినాన్ని పాటించారు. 1919 ఏప్రిల్ 13న నిరాయుధులైన భారతీయులను జనరల్ డయ్యర్ అత్యంత కిరాతకంగా హతమార్పించాడన్నారు. ఈ దారుణ సంఘటనలో వందలాది మంది చనిపోయారన్నారు. గొట్టేటి రవి, జీజీఎస్ నాగేశ్వరరావు, సీఏ సోమయాజులు, షేక్ అల్లావుద్దీన్, పి.హరిణి పాల్గొన్నారు.

బుక్ డిపాజిట్ సెంటర్ ప్రారంభం



పుస్తకాలతో సంఘ సభ్యులు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం బుక్ డిపాజిట్ కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు కోన రమణ, ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సీర సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు మరగడ అప్పారావు, మాజీ ఎంపీటీసీ ఆవాల గంగరాజు, శ్రీనివాస యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఇంద్రావు, ఉపాధ్యక్షులు చిరంజీవి, గ్రామ కార్యదర్శి మల్లేశ్వరరావు, పద్మనాభం లైబ్రేరియన్ నాగరాజు పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌల పంపిణీ



మహిళకు గ్యాస్ స్టౌ అందజేస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లిలో గురువారం ప్రధాన మంత్రి ఉజ్వల్ గ్యాస్ పథకం కింద పేదలకు ఉచితంగా గ్యాస్ స్టౌలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంటా జగదీశ్వరరావు మాట్లాడుతూ ఉజ్వల్ గ్యాస్ పథకం పేదలకు వరంగా మారిందన్నారు. అర్హులైన పేదలందరూ దళారీలను ఆశ్రయించకుండా ఉచిత స్టౌ, గ్యాస్ కనెక్షన్ కోసం నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ముగ్గురికి గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీవీ ప్రసాదరావు పట్నాయిక్, ఉప్పాడ అప్పారావు, బుత్తల రాజు, లక్ష్మీపతి రావు తదితరులు పాల్గొన్నారు.

1600 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యంతో సీజ్ చేసిన వ్యాన్

పద్మనాభం: అక్రమంగా వ్యాన్‌తో తరలిస్తున్న 1600 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్టు సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం పూర్ణామార్కెట్ నుంచి పద్మనాభం మండలం మద్ది గ్రామంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు విక్రయించేందుకు బుధవారం రాత్రి వ్యాన్‌తో బియ్యం తరలిస్తుండగా క్రైమ్ ఎస్‌ఐ ఆర్.మల్లేశ్వరరావు మద్ది జంక్షన్‌లో పట్టుకున్నారని తెలిపారు. బియ్యంతోపాటు వ్యాన్‌ను సీజ్ చేశామన్నారు. క్రైమ్ ఎస్‌ఐ మల్లేశ్వరరావు ఫిర్యాదు మేరకు బియ్యం తరలిస్తున్న పూర్ణామార్కెట్ పెరికి వీధికి చెందిన గొర్లె దేవరాయలు, భీమునిపట్నం మండలం ఆర్.తాళ్లవలసకు చెందిన కిలారి అభిషేక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



గోడపై స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: అమ్మఒడి, వైఎస్సార్ పింఛను కానుక, ఆసరా, జగనన్న విద్యా దీవెన, జగనన్న చేదోడు, వసతి దీవెన వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయే అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టులో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. అర్హతే ప్రామాణికంగా, ఏ ఒక్కరి సిఫారసు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. అవినీతికి ఆస్కారం లేకుండా వలంటీర్ల ద్వారా గడప వద్దకే పథకాలు అందిస్తున్న ప్రభుత్వం మనదన్నారు. గత టీడీపీ పాలనలో పింఛను కావాలన్నా ఆఫీసుల చుట్టూ తిరగడంతోపాటు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదన్నారు. జన్మభూమి కమిటీలతో అడ్డంగా దోచుకున్న గత ప్రభుత్వానికి, వలంటీర్ల వ్యవస్థతో గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న నేటి ప్రభుత్వానికి తేడా ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నందున కొందరు మోసగాళ్లు మళ్లీ వస్తారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం ఈ ప్రాంతంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అంటిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, స్థానిక నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యంతో భూసార పరిరక్షణ

పద్మనాభం: భూసార పరిరక్షణలో రైతులందరూ భాగస్వాములు కావాలని విశాఖపట్నం రైతు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సుబ్రహ్మణ్యం కోరారు. మండలంలోని కోరాడ రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలపై గురువారం గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా సమగ్ర ఎరువులు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు, జిల్లా భూసార పరీక్ష విభాగం ఏడీఏ శ్రీదేవి, మండల వ్యవసాయ శాఖ అధికారి శశికళ పాల్గొన్నారు.

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారులు గురువారం గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు మట్టి పరీక్షల్లో శిక్షణ ఇచ్చారు. రైతులంతా భూసార పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ జిల్లా శిక్షణాధికారి చదువుల సుబ్రహ్మణ్యం, జిల్లా ఉద్యానవనశాఖాధికారి మన్మథరావు, భూసార పరీక్షా విభాగం ఏడీఏ శ్రీదేవి, భీమిలి సహాయ సంచాలకుడు బి.విజయప్రసాద్, ఏవో బి.శివకోమలి పాల్గొన్నారు.

రెడ్డిపల్లి సచివాలయంలో తనిఖీ

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనవెంట ఈవోఆర్డీ ఎం.ఉషారాణి ఉన్నారు. ముందుగా పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీవో విజయ్‌కుమార్ పరిశీలించారు.

కనక మహాలక్ష్మి, దుర్గాలమ్మ పండగలకు ముహూర్తం ఖరారు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస కాలనీ వాసులు జరుపుకునే కనక మహాలక్ష్మి, దుర్గాలమ్మ పండగకు ముహూర్తాలు ఖరారు చేశారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. మే 24న కనక మహాలక్ష్మి అమ్మవారి పండగకు చాటింపు, 25న అమ్మవారి దేవర, 26న అనుపు ఉత్సవం నిర్వహించనున్నారు. అదే నెల 27న గ్రామ దేవత దుర్గాలమ్మ పండగ చాటింపు, 28న ఉజ్జిడి, 29న దేవర నిర్వహిస్తారు. తిరిగి జూన్ 5న అమ్మవారికి ఉయ్యాల కంబాల, తొలేళ్ల ఉత్సవాలు జరిపిస్తారు. 6న దుర్గాలమ్మ అనుపు ఉత్సవంతో ముగియనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రకటించింది.

ఆక్రమణదారులపై ఫిర్యాదు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం పరిధి కొత్తవలస సర్వే నంబరు 57లో ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వేణుగోపాల్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుడు బోర రామకృష్ణ ఫిర్యాదు చేశారు. సుమారు 1.99 ఎకరాల ప్రభుత్వ స్థలం చుట్టూ ప్రహరీ కట్టి ఆక్రమించారని, స్థానిక వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు.

విద్యార్థులకు నవోదయ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో ఎంఈవో బాలామణి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో 30 మంది 5వ తరగతి విద్యార్థులకు భీమిలి ఎంఈవో కేపీ బాలామణి నవోదయ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు సాయి సంహిత స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచిత శిక్షణ, మెటీరియల్, ఫీజుల కోసం రూ.15 వేలు ఖర్చు చేశారన్నారు. రోజూ పాఠశాల అనంతరం రెండు గంటలపాటు ఉచిత శిక్షణ అందించారన్నారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు అందించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయురాలు పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంపీపీ వాసురాజు రూ.10వేల సాయం

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నైకు భీమిలి ఆదర్శప్రేమీ మండలి ద్వారా పరీక్షలకు హాజరయ్యే పేద విద్యార్థుల కోసం భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు గురువారం రూ.10వేలు సాయం అందించారు. భీమిలిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పరిచయ్, ప్రాథమిక, ప్రవేశిక, మాధ్యమిక, రాష్ట్ర భాష పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పుస్తకాలు, ఫీజుల నిమిత్తం ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్టు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



పెంట గ్రామంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు



వేములవలసలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న గృహ సారథులు, నాయకులు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వారి మద్దతు కోరుతూ నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం గ్రామాల్లో ఉత్సాహంగా కొనసాగుతోంది. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు కలిసికట్టుగా ఇంటింటికీ వెళ్లి జగన్ మోహన్ రెడ్డి పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం కింద లబ్ధి పొందడంతో జగన్ పాలనకు బ్రహ్మరథం పడుతున్నారు. సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ పేదలను ఆదుకుంటున్న జగనన్నే మరలా ముఖ్యమంత్రి కావాలని మద్దతు తెలుపుతున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లను ఇంటి గోడలపై అంటించుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎండను కూడా లెక్క చేయకుండా చాలా గ్రామాల్లో ఈ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. మండల నాయకులు కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

పద్మనాభం: మండలంలోని పెంట గ్రామంలో గురువారం రాత్రి జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ పాలన, జగనన్న పాలనలో తేడాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, మాజీ సర్పంచ్ చొప్ప కృష్ణ, కరిమిరెడ్డి రవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు ఎంతో గొప్పవి

భీమునిపట్నం: దేశానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన సేవలు ఎంతో గొప్పవని ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు అన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ కాలనీలో గురువారం జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఎంతో కష్టపడి ఉన్నత స్థితికి చేరుకున్నారని తెలిపారు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో దళితుల పట్ల వివక్ష కొనసాగడం దురదృష్టకరమన్నారు. జీవీ రమణ, గంధవరపు కృష్ణ, బోని పైడితల్లి, వెంకటశివ, పారుపల్లి నర్సింగరావు, భాగం లక్ష్మి, తిరుకోటి లక్ష్మి, కర్రి రేవతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

'ప్రచారభేరి' పోస్టర్ల విడుదల

తగరపువలస: కార్మిక లోకాన్ని వంచించిన బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఈ నెల 14 నుంచి 30 వరకు వామపక్షాలు చేపడుతున్న పోరాటాన్ని జయప్రదం చేయాలని భీమిలి డివిజన్ సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో గురువారం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ కూడలి వద్ద శుక్రవారం ప్రచార భేరి ప్రారంభించనున్నామన్నారు. అనంతరం ప్రచారభేరి పోస్టర్లు విడుదల చేశారు. అల్లు బాబూరావు, ఆర్.ఎస్.ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, కానూరి రాంబాబు, అల్లం గోవిందరావు, అప్పలరాజు, మనుకొండ సత్యారావు పాల్గొన్నారు.

పారిశ్రామిక ఎగ్జిబిషన్ ప్రారంభం నేడు



మాట్లాడుతున్న పారిశ్రామిక ఎగ్జిబిషన్ నిర్వాహకులు

పీఎం పాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా విశాఖ నగరంలో నిర్వహించిన జీ – 20 సమ్మిట్‌ను స్ఫూర్తిగా తీసుకుని పీ – 3 ఎగ్జిబిషన్ శుక్రవారంనిర్వహిస్తున్నామని నిర్వాహక ప్రతినిధి జీఎస్ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం వీ కన్వెన్షన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఉన్న పీ – 3 ఎగ్జిబిషన్స్ ఇండియా టీమ్‌కు పారిశ్రామిక రంగ నిపుణుల కోర్ కమిటీ ఉందన్నారు. పరిశ్రమలు పెట్టదలచుకున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ ఎగ్జిబిషన్‌లో అవసరమైన సమాచారం లభిస్తుందన్నారు. ఎగ్జిబిషన్‌లో భాగాంగా చిన్న తరహా, మధ్య తరహా పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించిన యంత్ర పరికరాలు ప్రదర్శిస్తామన్నారు. సుమారు 100కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ధనుష్ ఈసీవో ప్రొడక్ట్స్ అధ్యక్షుడు నిర్మల్ పురుషోత్తం పాల్గొన్నారు.

రెండు పాఠశాలల పరిశీలన

పద్మనాభం: మండలంలోని ఐనాడ, యాతపేట ప్రాథమిక పాఠశాలలను భీమునిపట్నం డైట్ లెక్చరర్ ఎస్.త్రినాథరావు గురువారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వర్కుబుక్సు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐనాడ పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం గణేష్ పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నగిరెడ్ల రమేష్ (40) ఆటో బోల్తా పడిన సంఘటనలో బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుని భార్య రమ ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. తల్లికి మందులు తీసుకురావడానికి రమేష్ ఆటోపై ఆశిపాలెం వైపు వెళ్తుండగా కుక్క అడ్డం రావడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో కింద రమేష్ ఇరుక్కుపోవడంతో తల, భుజం, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి పన్ను వేయడం లేదని జెడ్సీకి ఫిర్యాదు



జెడ్సీకి ఫిర్యాదు చేస్తున్న చంద్రశేఖర్

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం రామాలయం వద్ద ఊరు మధ్యలో ఉన్న తమ ఇంటికి పన్ను వేయాలని దరఖాస్తు చేసుకుంటే వేయకుండా ఆరు నెలలుగా ఆర్ఐ తిప్పుతున్నారంటూ పిల్లి.చంద్రశేఖర్, నాగమణి దంపతులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు వారు జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మిని గురువారం సాయంత్రం ఆమె చాంబర్‌లో కలిసి తమ గోడు వినిపించుకున్నారు. ఊరు మధ్యలోని తమ ఇంటికి నాలుగు వైపులా ఉన్న ఇళ్లకు ఇంటి పన్ను వేశారని... తమ ఇంటికి మాత్రం ఆర్ఐ అడిగిన రూ.30 వేలు లంచం ఇవ్వనందున పన్ను వేయకుండా ఆరు నెలలుగా తిప్పుతున్నారని ఆరోపించారు. స్పందనలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. దీంతో తక్షణమే ఇంటి పన్ను వేయిస్తామని జెడ్సీ కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు. సదరు ఇంటికి వెళ్లి కొలతలు, ఇతర వివరాలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. దీనిపై ఆర్ఐ ప్రదీప్ రెడ్డి స్పందిస్తూ అది ప్రభుత్వ భూమి అని సర్వేయర్ రిపోర్టు ఇచ్చారని, ఎండార్స్‌మెంట్ ఇవ్వమని అడ్మిన్‌కి చెప్పామన్నారు. డబ్బులు అడిగామన్న దానిలో నిజం లేదన్నారు.

జనతా భోజన పథకం ప్రారంభం

తగరపువలస: టీచర్స్ హెల్ప్ జనతా భోజన పథకాన్ని నిర్వాహకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆర్మీ రిటైర్డ్ హవల్దార్ బత్తుల కనకరాజు ఆర్థిక సాయంతో మొదటి రోజు తగరపువలస, మహారాజుపేట ప్రాంతంలో 50 మందికి భోజన ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో టీచర్స్ హెల్ప్ గ్రూప్ తరపున రామకృష్ణ పాల్గొన్నారు.

తక్కువ బియ్యం సరఫరాపై ఫిర్యాదు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలోని 34వ నంబరు రేషన్ డిపోను ప్రతీ నెల బియ్యం తరుగు వేధిస్తోంది. 2021 ఏప్రిల్ నెలలో జరిగిన పొరపాటు కారణంగా ప్రస్తుతం 50 కుటుంబాలకు ప్రతీ నెల బియ్యం అందకుండా పోతున్నాయి. దీంతో వినియోగదారులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ డిపోకు 2021 ఫిబ్రవరి, మార్చి నెలల్లో పౌరసరఫరాల శాఖ 171 బస్తాల వంతున సరఫరా చేసి మార్చిలో 154 బస్తాలు మాత్రమే అందించింది. డీలర్ ఈ పాస్ యంత్రం ద్వారా 154 బస్తాలు దిగుమతి చేసుకోగా అప్పట్లో అంతర్జాలంలో మాత్రం 143 బస్తాలు మాత్రమే కనిపించింది. 2021 జనవరిలో ఉన్న 829 కిలోల బ్యాలెన్స్ బియ్యానికి అనుసంధానంగా మార్చిలో 17 బస్తాలు తగ్గించారేమో అనుకున్న డిపో డీలర్‌కు అప్పటి నుంచి 710 కిలోల తరుగు బియ్యం నమోదవుతూ వస్తున్నాయి. దీనిపై 2021 నుంచి డీలర్ పలుమార్లు భీమిలి తహసీల్దార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తూనే వస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. సమస్య పరిష్కరించాలని తాటితూరువాసులు కోరుతున్నారు.

పౌరసరఫరాల కమిషనర్‌కు ఫిర్యాదు

ఈ నేపథ్యంలో 34వ నంబరు డిపో డీలర్ గుర్రపు వెంకటరమణ గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 2021 ఏప్రిల్ నెలలో ఈ పాస్ యంత్రం, సర్వర్లలో లోపం కారణంగా ప్రస్తుతం తనకు కేటాయించిన కార్డుదారులు అందరికీ రేషన్ పంపిణీ చేయలేకపోతున్నాని పేర్కొన్నారు. ఇలానే కొనసాగితే కార్డుదారులు తనపై దాడికి దిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నెలలో జరిగిన లోపాన్ని ఎం.ఎల్.ఎస్ పాయింట్ నుంచి వచ్చిన ఆర్వో, అంతర్జాలంలో నిల్వలు, ఎండీ ఆపరేటర్ నిల్వలతో సరిచూసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్డుదారులందరికీ సరిపడా బియ్యం సరఫరా చేయించాలని కోరారు.

మళ్లీ పగిలిన పైప్‌లైన్



చిట్టివలస జెడ్పీ హైస్కూల్ వద్ద పగిలిన పైప్‌లైన్

తగరపువలస: భీమిలి పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ మూడు రోజుల క్రితం చిట్టివలస జెడ్పీ హైస్కూల్, గణేష్ థియేటర్ కూడలి వద్ద రెండుచోట్లా పగిలి పోవడంతో ఈ ప్రాంతాల్లో తాగునీరు ఏరులా ప్రవహిస్తోంది. గోస్తనీ నది తీరాన కొండపేట పంప్‌హౌస్ నుంచి భీమిలి కృష్ణా కాలనీ, కొండపేట కృత్రిమ రిజర్వాయర్ల వరకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ మూడేళ్లుగా తరచూ పగిలి పోతుండటం... సిబ్బంది రోజుల తరబడి మరమ్మతులు చేయడం అలవాటుగా మారిపోయింది. గత ప్రభుత్వాల పాలనలో కొండపేట నుంచి భీమిలి వరకు చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ సమయంలో రీయిన్‌ఫోర్స్‌డ్ గ్లాస్ మెటీరియల్ వినియోగించారు. నిర్మాణ సమయంలో పైపు చుట్టూ ఇసుక వేయకుండా అక్కడే తవ్విన గ్రావెల్ వేయడంతో తరచూ నీటి సరఫరా సమయంలో పైపు వైబ్రేషన్‌కు గ్రావెల్‌లో రాళ్లు తగిలి పైపు పగిలిపోతోంది. దీనికి మరమ్మతులు నిర్వహించడం సిబ్బందికి కఠినంగా మారుతోంది. చిట్టివలస – భీమిలి మధ్య సుమారు 25 చోట్ల తరచూ ఎక్కడో ఒకచోట పైప్‌లైన్ పగిలిపోతూనే ఉంది. దీనివల్ల మరమ్మతులకే ఎక్కువ సమయం, డబ్బులు వృథా అవుతున్నాయి. పైప్‌లైన్ పగిలిన ప్రదేశం చుట్టూ చెరువులా నీరు నిలిచి ఉండిపోవడంతో సమీప ఇళ్లలోకి ప్రవేశిస్తోంది. ఈ కష్టాలను నివారించడానికి చిట్టివలస పంప్‌హౌస్ నుంచి భీమిలి వరకు కొత్త పైప్‌లైన్ నిర్మించాలని భీమిలి జోన్ ప్రజలు కోరుతున్నారు.

క్షయ వ్యాధిపై ఇంటింటా సర్వే

ఆనందపురం : క్షయ వ్యాధి నివారణకు ఆరోగ్య శాఖ అధికారులు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని తర్లువాడ ఎస్సీ కాలనీలో గురువారం సర్వే చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉంటే క్షయగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందచేస్తామని తెలిపారు. చుట్ట, బీడీ, సిగరెట్లు వంటివి తాగడం వల్ల క్షయ వ్యాధి రావడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. తర్లువాడ ఎస్సీ కాలనీలో క్షయ లక్షణాలున్న 12 మంది నుంచి పరీక్షల నిమిత్తం కఫం సేకరించారు. పరీక్షల అనంతరం వారికి వివరాలు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి ఎన్వీ రమణ, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి కేకేవీ బులికృష్ణ

కొమ్మాది: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, గీతం స్కూల్ ఆఫ్ లా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ముందుగా న్యాయ సేవలపై ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. న్యాయ సేవల యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వర్ణ గౌరి తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి గేటు వితరణ

పద్మనాభం: మండలంలోని మద్ది రామాలయానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు సొంత నిధులు రూ.57 వేలతో గురువారం స్టీల్ గేటు ఏర్పాటు చేశారు. తన తండ్రి సత్యం జ్ఞాపకార్థం ఎంపీపీ ఈ గేట్లు ఏర్పాటు చేశారు. గర్భ గుడికి గతంలో గేట్లు లేకపోవడంతో ప్రస్తుతం ఆయన సమకూర్చారని స్థానికులు తెలిపారు.

కారు బోల్తా

కొమ్మాది: జాతీయ రహదారి ఎండాడ నుంచి రుషికొండ బీచ్‌వైపు వస్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. అతి వేగంగా రావడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీకి అభినందనలు

తగరపువలస: ఆనందపురం మండలంలో నూతనంగా ఎన్నికైన పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు గురువారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం మాజీ కో ఆప్షన్ సభ్యుడు జంగం జోషి, ఫెలోషిప్ నూతన అధ్యక్షుడు ప్రభుదాస్ మాట్లాడుతూ క్రిస్టియన్లంతా పదేళ్లుగా శ్మశానవాటికలు, కమ్యూనిటీ హాళ్ల కోసం ప్రభుత్వ ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తహసీల్దార్‌కు సిఫారసు చేశారన్నారు. ఎమ్మెల్యేను ముఖ్య సలహాదారుడు ప్రశాంత్‌కుమార్, ఏపీవీడీ ప్రభాకర్, కార్యదర్శి ఆనందరావు, ప్రవీణ్, హానోకు, శాంతిరాజు, బొత్స డేవిడ్, ఎస్.పాల్, గ్లోరీ పుష్ప, మినీగ్లోరీ తదితరులు కలిశారు.

ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం కళానగర్‌లో 250 గజాల ప్రభుత్వ భూమి రక్షణకు రెవెన్యూ సిబ్బంది గురువారం చర్యలు చేపట్టారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 161, కళానగర్‌లో ప్రభుత్వ భూమికి కొందరు ఫెన్సింగ్ వేసి ఆక్రమణకు ప్రయత్నించారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది స్పందించి ఆ ఫెన్సింగ్ కూలగొట్టారు. ఈ భూమి రక్షణకు చర్యలు చేపడతున్నామని, ఇక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని విశాఖ రూరల్ మండల ఆర్ఐ మల్లేశ్వరరావు చెప్పారు.

